సాక్షి
మంచిర్యాల
గురువారం । 13 । ఏప్రిల్ । 2023



కార్మికుల గోడు పట్టేదెవరికి?

శాలివాహన గ్రీన్ ఎనర్జీ బయోమాస్ పవర్ ప్లాంటులో ఉత్పత్తి నిలిచిపోవడంతో కార్మికుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారింది. 4నెలలుగా వేతనాల్లేక ఇబ్బంది పడాల్సి వస్తోంది. 8లో▸



చదువుతోనే ఉజ్వల భవిష్యత్

చదువుతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. తాండూర్, కాసిపేట, బెల్లంపల్లి మండలాల్లో పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
41.0 /27.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఎండల తీవ్రత పెరిగే అవకాశం ఉంది. పడమర దిశగా వేడిగాలులు వీస్తాయి.



రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

ఓటరు జాబితా రూపొందించాలి

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్



కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ సంతోష్

మంచిర్యాలఅగ్రికల్చర్: ఎలాంటి పొరపాట్లు లేకుండా ఓటరు జాబితా రూపొందించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ అన్నారు. బుధవారం హైదరాబాద్ నుంచి సంయుక్త ప్రధాన ఎన్నికల అధికారి టి.రవికిరణ్‌తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లతో ఓటరు జాబితా పీఎస్ఈ ఎంట్రీ ధ్రువీకరణ, ఓటరు ఎపిక్ కార్డుల జారీ, బూత్‌స్థాయి అధికారుల నియామకం అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ మాట్లాడుతూ ఓటరు జాబితా నుంచి తొలగించిన వారి వివరాలను పరిశీలించి ధ్రువీకరించాలని, ఫొటో ఓటరు జాబితా మొదటి విడత క్షేత్ర స్థాయిలో తొలగించిన ఓటర్ల వివరాలు మరోసారి పరిశీలించాలని తెలిపారు. కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ జిల్లాలో 17,687 మంది ఓటర్ల వివరాలు జాబితా నుంచి తొలగించారని, ఈ వివరాలను మరోసారి పరిశీలిస్తామని తెలిపారు. అనంతరం కలెక్టర్ చాంబర్‌లో జిల్లా అదనపు కలెక్టర్లు డి.మధుసూదన్‌నాయక్, బి.రాహుల్‌తో కలిసి సంబంధిత అధికారులతో ఓటరు జాబితా రూపకల్పన, సవరణలు తొలగింపులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల, బెల్లంపల్లి ఆర్డీవోలు వేణు, శ్యామల దేవి, అధికారులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి రూ.కోటి



అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న సుమన్

జైపూర్: చెన్నూర్ నియోజకవర్గ వ్యాప్తంగా గురుకులాల్లో విద్యాభివృద్ధికి రూ.కోటి మంజూరు చేయనున్నట్లు ప్రభుత్వ విప్ బాల్క సుమన్ తెలిపారు. మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులంలో ఏర్పాటు చేసిన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విగ్రహాన్ని బుధవారం పెద్దపల్లి పార్లమెంటు సభ్యుడు బోర్లకుంట వెంకటేశ్‌నేత, జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రేణికుంట్ల ప్రవీణ్‌తో కలిసి విప్ బాల్క సుమన్ ప్రారంభించారు. పూర్వ విద్యార్థులంతా కలిసి గురుకులంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం పాఠశాలలో తెలంగాణ ప్రభుత్వం విద్యాశాఖ అభివృద్ధికి చేపడుతున్న అంశాలపై ఆర్‌సీవో స్వరూపరాణి, ఏఆర్‌సీవో మహేశ్వర్‌రావు, జైపూర్, మందమర్రి, కోటపల్లి ప్రిన్సిపాల్‌లు బాలభాస్కర్, ప్రేమ్‌రాణి, రమేశ్‌బాబుతో చర్చించారు. జైపూర్ గురుకులానికి రూ.50లక్షలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ నరేందర్, పేరెంట్స్ కమిటీ సభ్యులు ఎల్లయ్య, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

వేసవి క్రీడా శిక్షణ శిబిరాలకు దరఖాస్తుల ఆహ్వానం

మంచిర్యాలటౌన్: జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో వేసవి క్రీడా శిక్షణ శిబిరాల నిర్వహణకు వ్యాయామ ఉపాధ్యాయులు, సీనియర్ క్రీడాకారుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా యువజన క్రీడల అధికారి బి.శ్రీకాంత్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో మే ఒకటి నుంచి 31వరకు వేసవిలో నిర్వహించే వివిధ క్రీడాంశాలకు గాను క్రీడా శిక్షణ శిబిరాలు ఉంటాయని తెలిపారు. స్థానికంగా ఉండి క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహించగలిగే వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తులను ఈ నెల 20లోగా జిల్లా కేంద్రంలోని జిల్లా యువజన క్రీడల కార్యాలయం, డీవైఎస్‌ఓ గ్రౌండ్, జెడ్పీ బాలుర పాఠశాల మంచిర్యాలలో వ్యక్తిగతంగా/పోస్టు ద్వారా పంపించాలని తెలిపారు. గ్రామీణ, కొత్త కేంద్రాలకు ప్రాముఖ్యత ఉంటుందని, గ్రామీణ ప్రాంతాల్లో 10, పట్టణ ప్రాంతాల్లో 10 శిబిరాలు ఉంటాయని, వివరాలకు జిల్లా యువజన క్రీడల శాఖ అధికారిని 93466 55441నంబరులో సంప్రదించాలని తెలిపారు.

ప్రాణహితపై ప్రాజెక్టు నిర్మిస్తాం

- స్వరాష్ట్రంలో ఉమ్మడి ఆదిలాబాద్‌పై నిర్లక్ష్యం
- సింగరేణి ప్రైవేటీకరణతో నిరుద్యోగులకు నష్టం
- వచ్చే ఎన్నికల్లో అన్ని స్థానాల్లో గెలుస్తాం
- 'సత్యాగ్రహ సభ'కు భారీగా తరలిరావాలి
- సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క



సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: తమ పార్టీ అధికారంలోకి రాగానే ప్రాణహిత నదిపై ప్రాజెక్టు నిర్మించి ఈ ప్రాంత సాగునీటి గోస తీర్చుతామని కాంగ్రెస్ శాసనసభాపక్ష నేత మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. తెలంగాణ ఏర్పడ్డాక ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మరింత నిర్లక్ష్యానికి గురైందని, పాదయాత్రలో ప్రజల సమస్యలు ప్రత్యక్షంగా చూశానని తెలిపారు. 'హాథ్ సే హాథ్ జోడో'లో భాగంగా 'భట్టి' చేపట్టిన పీపుల్స్‌మార్చ్ పాదయాత్ర గత నెల 16న ఆదిలాబాద్ జిల్లా బోథ్ నియోజకవర్గం బజార్‌హత్నూర్ మండలం పిప్రిలో ప్రారంభమై ఖానాపూర్, ఆసిఫాబాద్, బెల్లంపల్లి, చెన్నూర్ మీదుగా మంచిర్యాల నియోజకవర్గానికి చేరింది. 22 రోజుల్లో 280 కిలోమీటర్లు పాదయాత్ర పూర్తి చేశారు. పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ పార్లమెంటు సభ్యత్వంపై అనర్హత వేటు వేయడాన్ని నిరసిస్తూ ప్రజాస్వామ్య పరిరక్షణ పేరుతో ఈ నెల 14న నస్పూర్‌లో 'సత్యాగ్రహ సభ' నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా 'భట్టి' 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

బీఆర్‌ఎస్‌పై నమ్మకంపై పోయింది

నీళ్లు, నిధులు, నియామకాల కోసం రాష్ట్రాన్ని తెచ్చుకుంటే ఇవేమీ ఇవ్వకుండా సొంత లాభం కోసమే సీఎం కేసీఆర్ పని చేస్తున్నారు. దీంతో ప్రజల్లో బీఆర్‌ఎస్‌పై నమ్మకం పోయింది. ఉమ్మడి రాష్ట్రంలో కంటే స్వరాష్ట్రంలోనే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నష్టపోయింది. ప్రాణహిత–చేవేళ్ల ప్రాజెక్టుతో ఈ ప్రాంతమంతా సస్యశ్యామలం అయ్యేది. మేం చేపట్టిన ఎనిమిది మధ్య తరహా ప్రాజెక్టులను పట్టించుకోకపోవడంతో వేలాది ఎకరాలకు నీరు అందలేదు. రూ.పదివేల కోట్లు ఖర్చు చేసిన ప్రాణహిత ప్రాజెక్టును కాదని కాళేశ్వరం కట్టారు. నీళ్లు ఇవ్వకపోగా వేల ఎకరాల్లో ప్రాణహిత, గోదావరి తీర ప్రాంత రైతుల పంటలు మునిగి నష్టపోతున్నారు. మేం అధికారంలోకి రాగానే ప్రాణహితపై ప్రాజెక్టు నిర్మించి తీరుతాం.

సింగరేణి ప్రైవేటీకరణతో నష్టం

సింగరేణిలో లక్షలాది మందికి ఉద్యోగ, ఉపాధి కల్పించవచ్చు. అలాంటి సంస్థలో చివరకు బొగ్గు తీసే చోట కూడా ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తున్నారు. రెగ్యులర్ ఉద్యోగాలకు బదులు అవుట్ సోర్సింగ్ కింద తీసుకుని నిరుద్యోగులకు అన్యాయం చేస్తున్నారు. జైపూర్ థర్మల్ పవర్ ప్లాంటులోనూ స్థానికులకు అవకాశం ఇవ్వడం లేదు. గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు నిర్వహించే ధైర్యం లేక జాప్యం చేస్తున్నారు. మేం అధికారంలోకి రాగానే బొగ్గు గనులను జాతిసంపదగా గుర్తిస్తాం.

ప్రచారంలోనే ప్రభుత్వ పథకాలు

రెండుసార్లు అధికారం ఇచ్చినా, బీఆర్‌ఎస్ నేటికీ ఒక్క పథకం సరిగా అమలు చేయలేదు. పాదయాత్ర చేసిన ఏ గ్రామంలోనూ భగీరథ నీళ్లు కనిపించలేదు. డబుల్ బెడ్ రూం ఇళ్లు, దళితులకు మూడెకరాల భూమి, దళితబంధు, పింఛన్లు సరిగా రావడం లేదు. పోడు సమస్య అలాగే ఉంది. గతంలో ఇచ్చిన అసైన్డ్, సీలింగ్ భూములను లబ్ధిదారుల నుంచి లాక్కుంటున్నారు. ప్రశ్నపత్రాలు లీక్ చేస్తూ నిరుద్యోగుల భవిష్యత్‌ను నాశనం చేస్తున్నారు. ఆబ్కారీ ఆదాయం పెంచడం కోసం బెల్టుషాపులను ప్రోత్సహించి పేద, మధ్యతరగతి కుటుంబాల్లో చిచ్చుపెడుతున్నారు.

వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఇప్పటికీ కాంగ్రెస్ పార్టీ బలంగా ఉంది. వచ్చే ఎన్నికల్లో పది అసెంబ్లీ స్థానాలతోపాటు రెండు ఎంపీ స్థానాలు గెలుస్తాం. గెలుపు అభ్యర్థుల ఎంపిక కోసం పార్టీలో నిర్దిష్ట విధానం ఉంది. ప్రజల్లో నమ్మకం ఉన్న నాయకులు, అంకితభావంతో పని చేసే వారికి తగిన గుర్తింపు ఉంటుంది. వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే.

సభకు భారీగా తరలిరావాలి.

దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడింది. కేంద్రంలో ప్రధాని మోదీ, రాష్ట్రంలో సీఎం కేసీఆర్ వ్యవస్థలను భ్రష్టు పట్టిస్తున్నారు. ప్రతిపక్షాల గొంతు నొక్కుతున్నారు. దేశంలో ప్రజాస్వామ్యం బతకాలంటే ప్రజాస్వామ్యవాదులు, మేధావులు తరలిరావాలి. రాజ్యాంగం రచించిన అంబేడ్కర్ జయంతి రోజు ఈ నెల 14న భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నాం. ఈ సభకు అందరూ తరలిరావాలని కోరుతున్నాం.

సత్యాగ్రహ సభ ఏర్పాట్లు ముమ్మరం



నస్పూర్‌లో బహిరంగ సభ ఏర్పాట్లు

నస్పూర్: నస్పూర్ పట్టణంలోని కలెక్టరేట్ సమీకృత భవనం సమీపంలో ఈ నెల 14న కాంగ్రెస్ పార్టీ తలపెట్టిన సత్యాగ్రహ సభకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. సభా ప్రాంగణానికి బీఆర్ అంబేడ్కర్ ప్రాంగణంగా నామకరణం చేశారు. సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క చేపట్టిన పీపుల్స్‌మార్చ్ పాదయాత్ర మంచిర్యాలకు చేరిన సందర్భంగా, రాహుల్‌గాంధీ పార్లమెంటు సభ్యత్వాన్ని రద్దు చేయడాన్ని నిరసిస్తూ సభ నిర్వహించనున్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి కాంగ్రెస్ పార్టీ అభిమానులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు సుమారు లక్ష మంది హాజరవుతారని నాయకత్వం అంచనా వేస్తోంది. ఒకరకంగా ఈ సభను కాంగ్రెస్ పార్టీ శాసనసభ ఎన్నికల సమరభేరీగానే భావిస్తోంది. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే హాజరవుతుండడంతో ఏర్పాట్లను రాష్ట్ర నాయకులు పర్యవేక్షిస్తున్నారు. కార్యకర్తలు, ప్రజలు జాతీయ రహదారి విలేజ్ నస్పూర్ టర్నింగ్ వద్ద నుంచి సభాస్థలానికి చేరుకుంటారు. వీఐపీలు కలెక్టరేట్‌కు వెళ్లే దారి నుంచి చేరుకునేలా ఏర్పాట్లు చేస్తున్నారు. సభా ప్రాంగణంలో సుమారు 70వేల కుర్చీలు ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వేసవి కాలం దృష్ట్యా సభకు వచ్చే వారికి తాగునీరు వసతి కల్పిస్తున్నారు. సభ సాయంత్రం నిర్వహిస్తుండడంతో భారీ ఎత్తున లైట్లు సైతం ఏర్పాటు చేస్తున్నారు. ఏఐసీసీ సభ్యుడు కొక్కిరాల ప్రేంసాగర్‌రావు, డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ఎప్పటికప్పుడు సభ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

సీఐఎస్ఎఫ్ వర్సెస్ సింగరేణి..!



ప్రధాన గేటులో సీఐఎస్ఎఫ్ సెక్యూరిటీ సిబ్బంది తనిఖీలు

- సెక్యూరిటీ అత్యుత్సాహంపై ఎస్టీపీపీ అధికార యంత్రాంగం గరం
- వరుస చోరీలతో ఆందోళనలో ఉద్యోగులు
- భద్రత పేరుతో ఉన్నతాధికారులకూ మెటల్ డిటెక్టర్ తనిఖీలు
- తారాస్థాయికి సీఐఎస్ఎఫ్, సింగరేణి మధ్య విభేదాలు

జైపూర్: మంచిర్యాల జిల్లా జైపూర్ మండల కేంద్రంలోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటు(ఎస్టీపీపీ)కు భద్రత కల్పిస్తున్న సీఐఎస్ఎఫ్(సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్), సింగరేణి మధ్య విభేదాలు తారాస్థాయికి చేరాయి. రెండింటి మధ్య రోజు రోజుకు చోటు చేసుకుంటున్న పరిణామాలు చర్చనీయాంశంగా మారుతున్నాయి. సీఐఎస్ఎఫ్ సెక్యూరిటీనే ఇప్పుడు తలనొప్పిగా మారిందంటూ ఎస్టీపీపీ ఉన్నతాధికారుల నుంచి ఉద్యోగుల వరకు వ్యాఖ్యానిస్తున్నారు. పవర్‌ప్లాంటుకు భద్రత కల్పించాల్సిన సెక్యూరిటీ అత్యుత్సాహం ప్రదర్శిస్తూ భద్రత పేరుతో ఉన్నతాధికారులనూ మెటల్ డిటెక్టర్‌తో తనిఖీలు చేయడం ఎస్టీపీపీ అధికార యంత్రాంగం జీర్ణించుకోలేకపోతోంది. తాజాగా ఎస్టీపీపీలో చోటు చేసుకున్న పరిణామాల నేపథ్యంలో సీఐఎస్ఎఫ్ సెక్యూరిటీ భద్రత పేరుతో హెచ్‌ఓడీఎం ఉన్నతాధికారిని ఇబ్బందులకు గురి చేయడం, వారి ప్రవర్తనపై ఎస్టీపీపీ అధికారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జైపూర్‌లోని 1200మెగావాట్ల ఎస్టీపీపీ విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించకముందు 2016 నుంచే సీఐఎస్ఎఫ్ భద్రత కల్పిస్తోంది. వారి కోసం ప్రత్యేక భవనాలు, వసతులు, పరేడ్‌గ్రౌండ్‌తోపాటు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తూ రూ.కోట్లు ఖర్చు చేస్తోంది. పవర్‌ప్లాంటు ప్రారంభంలో 200మంది వరకు సీఐఎస్ఎఫ్ సెక్యూరిటీ ఉండగా.. సింగరేణి అన్ని ఏరియాల్లో సీఐఎస్ఎఫ్ సెక్యూరిటీని తొలగించింది. పవర్‌ప్లాంటుకు మాత్రమే భద్రత కల్పించే అవకాశం ఇవ్వడంతో సీఐఎస్ఎఫ్ కమాండెంట్, అసిస్టెంట్ కమాండెంట్, డిప్యూటీ కమాండెంట్ నేతృత్వంలో 400మందికి పైగా సెక్యూరిటీతో భద్రత కల్పిస్తున్నారు. మంచిర్యాల–చెన్నూర్ జాతీయ రహదారిపై ప్రధాన గేట్, మెటల్‌గేట్‌తోపాటు నర్వ వద్ద క్వార్టర్స్‌కు వెళ్లేందుకు మరోగేటు, పెగడపల్లి వద్ద మినీగేట్, అంతర్భాగంలో బాయిలర్ల ముందు, గేట్ వద్ద భద్రత విధులు నిర్వర్తిస్తారు. ప్రహరీ చుట్టూ మధ్యలో ప్రైవేటు సెక్యూరిటీ పని చేస్తుండగా.. వారిపై సీఐఎస్ఎఫ్ సెక్యూరిటీ పహారా కాస్తున్నారు. సెక్యూరిటీ సిబ్బంది ఇక్కడి వారితో సరిగ్గా ప్రవర్తించకపోవడం కొంత ఇబ్బందులకు గురి చేస్తుండగా.. కమాండెంట్ ఒక్కొక్కరూ ఒక్కో తీరుగా వ్యవహరించడం విభేదాలకు కారణమవుతోంది. పవర్‌ప్లాంటుకు భద్రత కల్పిస్తూ చోరీలు జరగకుండా చూడాల్సి ఉండగా.. సీఐఎస్ఎస్ వైఫల్యం మూలంగా వరుసగా ఇనుప సామగ్రి, డీజిల్, ఇతర వస్తువులు చోరీకి గురవుతున్నాయి. ఉద్యోగుల క్వార్టర్స్‌లో దొంగలు పడడం ఆందోళన కలిగిస్తోంది. భద్రత వైఫల్యాలపై దృష్టి సారించి లోపాలను గుర్తించి భద్రతను కట్టుదిట్టం చేయాల్సి ఉండగా.. ఎస్టీపీపీ ఉన్నతాధికారులను భద్రత పేరుతో ఇబ్బందులకు గురి చేస్తుండడం వల్ల ఇద్దరి మధ్య పచ్చిగడ్డి వేస్తే భగ్గుమనేలా పరిస్థితి తయారైంది.

ఏటా రూ.40కోట్ల వేతనాలు...

సీఐఎస్ఎఫ్ సెక్యూరిటీకి ఏటా రూ.40కోట్లు వేతనాలు చెల్లిస్తున్నారు. సీఐఎస్ఎఫ్ సెక్యూరిటీ 400మందితో భద్రత అవసరం లేదని, సింగరేణి సొమ్ము వృథా అవుతోందని ఉద్యోగుల భావన. శాంతిభద్రతల దృష్ట్యా జైపూర్ సబ్ డివిజన్‌గా డీసీపీ స్థాయిలో పోలీస్ అధికారి ఇక్కడ పని చేస్తున్నారు. సింగరేణి సంస్థలో ఎస్ఎన్‌పీ సెక్యూరిటీ ప్రత్యేక విభాగం పనిచేస్తోంది. వీరికి తోడుగా ప్రైవేటు ఏజెన్సీల్లో సెక్యూరిటీ సిబ్బంది పని చేస్తున్నారు. సీఐఐఎస్ఎఫ్ సెక్యూరిటీ మూలంగా వచ్చే ప్రయోజనం ఏమీ లేదన్న ఆలోచనలో సింగరేణి అధికార యంత్రాంగం ఉన్నట్లు తెలుస్తోంది.

నేటి నుంచి 'పది' మూల్యాంకనం

- కేంద్రం వద్ద పోలీసుల భద్రత
- 13నుంచి 21వరకు స్పాట్‌వాల్యూయేషన్
- సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయుల కేటాయింపు



స్ట్రాంగ్‌రూం వద్ద పోలీస్ పహారా

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల కార్మెల్ హైస్కూల్‌లో తొలిసారిగా పదో తరగతి స్పాట్‌వాల్యుయేషన్ కేంద్రం కేటాయించారు. పేపర్ లీకేజీ ఘటన నేపథ్యంలో మూల్యాంకన కేంద్రం వద్ద పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు. ఈ నెల 13నుంచి 21వరకు పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనం నిర్వహించనున్నారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు స్పాట్ వాల్యుయేషన్ నిర్వహిస్తారు. జిల్లాలో మొదటిసారిగా నిర్వహిస్తున్న మూల్యాంకనం పకడ్బందీగా నిర్వహించేందుకు విద్యాశాఖ అధికారులు సన్నద్ధం అవుతున్నారు. విధుల్లో అసిస్టెంట్ క్యాంపు ఆఫీసర్లు 10, సహాయ అసిస్టెంట్ క్యాంపు ఆఫీసర్లు 10, చీఫ్ ఎగ్జామినర్, అసిస్టెంట్ ఎగ్జామినర్‌లుగా తెలుగు 55, హిందీ 92, ఇంగ్లిషు 82, గణితం 105, భౌతిక శాస్త్రం 102, జీవశాస్త్రం 115, సాంఘిక శాస్త్రం 174, స్పెషల్ అసిస్టెంట్లు 203మంది మొత్తం 928 మందిని నియమించారు. 13న ఉదయం ఎనిమిది గంటలకు క్యాంపు ఆఫీసర్ కార్మెల్ కాన్వెంట్ హైస్కూల్‌లో రిపోర్టు చేయాల్సి ఉంటుంది. జవాబు పత్రాల మూల్యాంకనానికి కేటాయించిన సీఈ, ఏఈలు మూడేళ్ల నుంచి పదేళ్ల పదో తరగతి బోధన అనుభవం ఉండాలనే నిబంధన విధించారు. అనుభవం లేని వారిని ప్రధానోపాధ్యాయుడు పాఠశాలల నుంచి విడుదల చేయరాదని విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. మూల్యాంకన కేంద్రంలో సెల్‌ఫోన్లు నిషేధించారు. ప్రధానోపాధ్యాయులు ఎస్ఏ 22 నిర్వహించడానికి కనీస ఉపాధ్యాయులు ఉండేవిధంగా చూసుకోవాలని డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు.

ఆదిలాబాద్ నుంచి మంచిర్యాలకు..

ఆదిలాబాద్ నుంచి మంచిర్యాలకు పదో తరగతి స్పాట్ వాల్యుయేషన్ కేంద్రం ఏర్పాటుతో ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇదివరకు ఆదిలాబాద్‌లో ఉండడంతో పడరాని పాట్లు పడ్డారు. మంచిర్యాల నుంచి ఆదిలాబాద్ దాదాపు 200 కిలోమీటర్ల దూరంలోని కేంద్రానికి ఉపాధ్యాయులు వెళ్లాలంటే ఒకటికి రెండు సార్లు ఆలోచించేవారు. ఆదిలాబాద్‌కు వెళ్లిన వారికి వసతి, భోజనం లభించక ఎన్నో ఇక్కట్లకు గురయ్యారు. మంచిర్యాలలో కేంద్రం ఏర్పాటు వల్ల నిర్ణీత సమయంలో మూల్యాంకనం పూర్తయ్యే అవకాశాలున్నాయి.

సీఓఈ సెట్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

- రుక్మాపూర్ సైనిక్ స్కూల్‌కు ముగ్గురు ఎంపిక
- రాష్ట్ర స్థాయి సీఓఈల్లో తొమ్మిది మంది..



ప్రిన్సిపాల్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

బెల్లంపల్లి: తెలంగాణ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ(సీఓఈ) కళాశాలల్లో ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి నిర్వహించిన సీఓఈ సెట్ ఫలితాల్లో బెల్లంపల్లి ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. సైనిక్‌స్కూల్, సీఓఈల్లో ప్రవేశానికి వేర్వేరుగా నిర్వహించిన సీఓఈ సెట్–2023 ఫలితాలు బుధవారం వెల్లడయ్యాయి. కరీంనగర్‌లోని రుక్మాపూర్ సైనిక్ స్కూల్‌లో ప్రవేశానికి దుర్గం సంజయ్, ఎస్కిల్ల రిషిక్, కాంపల్లి జశ్వంత్ ఎంపీసీ విభాగంలో అర్హత సాధించారు. రాష్ట్ర స్థాయిలో ఐఐటీ, నీట్‌లలో శిక్షణ కేంద్రాలైన సీఓఈలు నాలుగు ఉన్నాయి. వీటిలో ప్రవేశానికి తొమ్మిది మంది అర్హత సాధించారు. వీరిలో ఐల సాయిరాం, గొర్లపల్లి సాత్విక్, కాసర్ల భువన్‌తేజ(బైపీసీ–గౌలిదొడ్డి), దుగుట హరీష్, ముడిమడుగుల సాయిచరణ్‌తేజ(ఎంపీసీ–గౌలిదొడ్డి), కొండగొర్ల సిద్ధార్థ(ఎంపీసీ–చిలుకూరు), ఉదరుకోట శ్రీహర్షన్, ఇల్లందుల మణితేజ(బైపీసీ–చిలుకూరు), కనుకుంట్ల రామ్‌చరణ్‌తేజ(ఎంపీసీ–షేక్‌పేట) ఉన్నారు. విద్యార్థుల ఎంపికపై ప్రిన్సిపాల్ సైదులు, ఉపాధ్యాయులను బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆదిలాబాద్ రీజియన్ కోఆర్డినేటర్ కొప్పుల స్వరూపారాణి అభినందించారు. ప్రిన్సిపాల్ సైదులుకు ఉపాధ్యాయులు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కోట రాజ్‌కుమార్, ఉపాధ్యాయులు రాజేశ్వర్, దత్తప్రసాద్, ప్రమోద్‌కుమార్, రామారావు, ప్రేమలత, సమందర్, తేజస్వీ పాల్గొన్నారు.

జనాభా లెక్కల నిర్వహణ కాంగ్రెస్‌తోనే సాధ్యం

- పీసీసీ మాజీ అధ్యక్షుడు వి.హన్మంతరావు
- నస్పూర్‌లో సభాస్థలం పరిశీలన



సభాస్థలిని పరిశీలిస్తున్న వీహెచ్, నాయకులు

నస్పూర్: దేశంలో కుల ప్రాతిపదికన జనాభా లెక్కలు చేపట్టి ఓబీసీ, బడుగు బలహీనవర్గాలకు న్యాయం చేయడం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని ఆ పార్టీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు వి.హన్మంతరావు అన్నారు. బుధవారం ఆయన ఏఐసీసీ కార్యదర్శి రోహిత్‌చౌదరి, కాంగ్రెస్ నాయకులతో కలిసి నస్పూర్‌లో ఈ నెల 14న నిర్వహించనున్న జై భారత్ సత్యాగ్రసభ స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రధానిగా మోదీ బాధ్యతలు చేపట్టి తొమ్మిదేళ్లు గడుస్తున్నా కుల ప్రాతిపదికన జనాభా లెక్కలు చేపట్టకపోవడం బాధాకరమని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే కుల ప్రాతిపదికన జనాభా లెక్కలు చేపడుతామని తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశంలో విద్వేషాలు రెచ్చగొడుతూ దేశాన్ని ముక్కలు చేయడానికి ప్రయత్నిస్తోందని విమర్శించారు. అదానీ, మోదీ మధ్య సంబంధాన్ని ప్రశ్నించినందుకే రాహుల్‌గాంధీ సభ్యత్వాన్ని రద్దు చేయించారని తెలిపారు. పంచాయతీరాజ్‌లలో మహిళలకు రిజర్వేషన్ కల్పించిన ఘనత కాంగ్రెస్‌పార్టీదేనని అన్నారు. నస్పూర్ బహిరంగ సభకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే, సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క హాజరవుతారని తెలిపారు. ప్రజలు, సింగరేణి కార్మికులు, యువకులు, మహిళలు పెద్దయెత్తున హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు. కౌన్సిలర్ సురిమిల్ల వేణు, నాయకులు శీపతి మల్లేశ్, ఐఎన్‌టీయూసీ ఏరియా ప్రధాన కార్యదర్శి జెట్టి శంకర్‌రావు, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఖలీద్, జిల్లా ప్రధాన కార్యదర్శి భూపతి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

పొన్నాల లక్ష్మయ్య పరిశీలన

బహిరంగ సభ స్థలాన్ని పీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య, ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ బుధవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు అవినాష్‌రెడ్డి, ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రవళిరెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వానికి అండగా ఉండాలి

- బీజేపీ, కాంగ్రెస్ పార్టీ కుట్రలను తిప్పికొట్టాలి
- బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్

జైపూర్: ప్రజా సంక్షేమం, అభివృద్ధి, రాష్ట్ర ప్రగతే ధ్యేయంగా పని చేస్తున్న తెలంగాణ ప్రభుత్వానికి ప్రజలు అండగా ఉండాలని, నిండు మనస్సుతో మరోసారి దీవించాలని ప్రభుత్వ విప్, బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్ అన్నారు. బుధవారం మండలంలోని దుబ్బపల్లి గ్రామంలో ఉన్న గార్డెన్‌లో బీఆర్‌ఎస్ పార్టీ మండల ఆత్మీయ సమ్మేళన సభ నిర్వహించారు. 20 గ్రామ పంచాయతీల్లోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఆరు వేలమందికి పైగా తరలివచ్చారు. సీఎం కేసీఆర్ సందేశం, తాను ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాక మండలంలో చేపట్టిన అభివృద్ధి ప్రగతి నివేదికను సుమన్ చదివి వినిపించారు. బాల్క సుమన్ మాట్లాడుతూ మండలంలో రూ.200 కోట్లకు పైగా అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. పక్కన ఉన్న మహారాష్ట్రలో బీజేపీ ప్రభుత్వం, ఛత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నాయని, మన ఊరికి వచ్చిన ఆ పార్టీల నాయకులను అక్కడికి తీసుకెళ్తే వారి బాగోతం బయటపడుతుందని అన్నారు. అక్కడ రోడ్లు కూడా సరిగా లేవని, వారి కుట్రలను తిప్పికొట్టాలని తెలిపారు. సీఎం కేసీఆర్ చెన్నూర్ ఎత్తిపోతల పథకానికి రూ.1,685 కోట్లు మంజూరు చేశారని తెలిపారు. ఎస్టీపీపీ విస్తరణలో భాగంగా నిర్మించే 800 మెగావాట్ల కొత్త ప్లాంటులో 500 మందికి పైగా నిరుద్యోగులకు ఉద్యోగాలు వస్తాయని తెలిపారు. ఎంపీ బోర్లకుంట వెంకటేశ్‌నేత, మాజీ ఎమ్మెల్యేలు నల్లాల ఓదెలు, గడ్డం అరవిందరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్, బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా ఇన్‌చార్జి నారదాసు లక్ష్మణ్‌రావు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ రేణికుంట్ల ప్రవీణ్, డీసీఎంఎస్ చైర్మన్ తిప్పర్తి లింగన్న మాట్లాడారు. అనంతరం భీమారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవికి రాజీనామా చేసి అయిలి నరేందర్, జైపూర్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇరిగిరాల లింగయ్యతోపాటు పలువురు నాయకులు బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి, ఎంపీపీ గోదారి రమాదేవి, జెడ్పీటీసీ మేడి సునిత, వైస్ ఎంపీపీ పెద్దపల్లి రమేశ్, పీఏసీఎస్ చైర్మన్ గుండు తిరుపతి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షులు బల్మూరి అరవిందర్‌రావు, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బాల్క సుమన్, వేదికపై ఎంపీ వెంకటేశ్‌నేత, నారదాసు లక్ష్మణ్‌రావు, భాగ్యలక్ష్మి

క్లుప్తంగా

బెల్లంపల్లిలో ముగ్గురికి కరోనా

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీలో కరోనా వైరస్ కలకలం రేపింది. బుధవారం స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో దగ్గు, జ్వరం, గొంతునొప్పితో బాధపడుతున్న 14 మందికి కరోనా పరీక్షలు నిర్వహించగా ముగ్గురికి కోవిడ్ సోకినట్లు నిర్ధారణ అయ్యింది. మంగళవారం నిర్వహించిన పరీక్షల్లో బెల్లంపల్లి మండలం దుగ్నేపల్లికి చెందిన ఒకరికి పాజిటివ్ వచ్చింది. సదరు వ్యక్తులకు వైద్య సలహాలు ఇచ్చి హోం ఐసోలేషన్‌లో ఉండాలని వైద్యులు సూచించారు. కరోనా పాజిటివ్ కేసులు బయట పడటంతో ప్రజల్లో ఒక్కసారిగా భయాందోళనలు మొదలయ్యాయి.

పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య

చెన్నూర్‌రూరల్: పురుగుల మందుతాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని కత్తెరసాలలో చోటు చేసుకుంది. కత్తెరసాల గ్రామానికి చెందిన మల్లవేన విజయ్ (22) అదే గ్రామానికి చెందిన బాలికతో తరచూ ఫోన్‌లో మాట్లాడుతున్నాడని ఆమె తల్లిదండ్రులు అనుమానం పెంచుకున్నారు. ఫోన్‌లో మాట్లాడితే కేసు పెట్టి జైలుకు పంపుతామని విజయ్‌ని వేధింపులకు గురిచేశారు. తనపై వచ్చిన ఆరోపణలు గ్రామంలో తెలిస్తే పరువు పోతుందని ఆందోళన చెందిన యువకుడు బుధవారం ఇంట్లోనే పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు ముందుగా చెన్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి, మెరుగైన వైద్యంకోసం అక్కడినుంచి మంచిర్యాలకు తరలించారు. పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. మృతుని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ వాసుదేవరావు తెలిపారు.

నేడు ఉద్యోగ మేళా

ఆసిఫాబాద్‌అర్బన్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజన నిరుద్యోగ యువతీ యువకులకు ప్రైవేటు రంగంలో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు నేడు ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో వరుణ్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌లోని కేబీ కాంప్లెక్స్‌లో ఉన్న యువజన శిక్షణ కేంద్రం(వైటీసీ)లో గురువారం ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇంటర్వ్యూకు హాజరయ్యే అభ్యర్థులు బయోడేటా, విద్యార్హత, కుల ధ్రువీకరణ పత్రాల జిరాక్స్ కాపీలతో సకాలంలో హాజరు కావాలని సూచించారు. 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు ఉన్నవారు అర్హులన్నారు. మరిన్ని వివరాలకు 9493535052, 7893616392, 9666748105 నంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి

మంచిర్యాలఅర్బన్: ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులకు ప్రభుత్వం చొరవ చూపాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్‌టీయూ) జిల్లా అధ్యక్షుడు శంకర్‌గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం మంచిర్యాలలో ఎస్‌టీయూ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీనెల ఒకటో తేదీన ఉపాధ్యాయుల వేతనాలు ఖాతాల్లో జమచేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, మహిళా జిల్లా అధ్యక్షురాలు పద్మజ, ఉపాధ్యక్షురాలు మహాలక్ష్మి, కోశాధికారి సత్తయ్య, సభ్యులు మాధవి, రమేశ్, రజిత, మన్మోహన్, తదితరులు పాల్గొన్నారు.

వాట్సాప్ గ్రూపులపై నజర్

- అభ్యంతరకరమైన పోస్టులపై పోలీసుల నిశిత పరిశీలన
- కించపరిచే వార్తాకథనాలను పోస్టుచేసే వారిపై నిఘా
- బెల్లంపల్లిలో 8 మందిపై కేసు నమోదు



బెల్లంపల్లి: సామాజిక మాధ్యమాల గ్రూపులపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. వ్యక్తిగత పరువు, ప్రతిష్టలకు భంగం కలిగించే విధంగా కొన్నిపత్రికల్లో వచ్చిన కథనాల క్లిప్పింగ్‌లను సామాజిక మాధ్యమాల గ్రూపుల్లో ఫార్వర్డ్ చేస్తున్న పోస్టులను నిశితంగా పరిశీలిస్తున్నారు. అత్యుత్సాహం ప్రదర్శించి అభ్యంతరకరమైన, తప్పుడు వార్తాకథనాలను రాసిన, క్లిప్పింగులను గ్రూపుల్లో పోస్టు చేస్తున్న వారిపై, ఆయా పోస్టులను పట్టనట్టు వ్యవహరిస్తున్న గ్రూపు అడ్మిన్‌లపై చట్టపరంగా కేసులు నమోదు చేస్తున్నారు. బెల్లంపల్లికి చెందిన ఓ మహిళ తనపై అభ్యంతరకరమైన వార్తా కథనాలను రాసి సోషల్‌మీడియా వేదికగా గ్రూపుల్లో పోస్టు చేశారని ఈనెల 7న టూటౌన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఎనిమిది మందిపై కేసు నమోదు చేశారు. ఇందులో ముగ్గురు పాత్రికేయులు, పోస్టు చేసిన ఓ వ్యక్తి, వాట్సాప్ గ్రూప్ అడ్మిన్‌లు నలుగురు ఉన్నారు.

విచ్చలవిడిగా గ్రూపుల్లో పోస్టులు

సాంకేతిక రంగం పురోభివృద్ధి చెందడంతో వాట్సాఫ్, ఫేస్‌బుక్, ట్విట్టర్, తదితర సామాజిక మాధ్యమాల గ్రూపుల్లో సమాచారం శరవేగంగా పోస్టు చేయడానికి అవకాశాలు ఏర్పడ్డాయి. ప్రస్తుతం అనేక మంది ఔత్సాహికులు గ్రూపులను క్రియేట్ చేసి సభ్యులను చేర్చుకుంటున్నారు. అడ్మిన్లు కనీసం సదరు సభ్యుడి నుంచి ముందస్తు అనుమతి కూడా తీసుకోవడం లేదు. ఇష్టారాజ్యంగా సభ్యులను చేర్చుకుని రేయింబవళ్లు ఆ గ్రూపులో పోస్టు చేస్తున్నారు. అవి ఏ అంశానికి సంబంధించినవో పరిశీలించకుండానే ఇబ్బడి ముబ్బడిగా పోస్టు చేయడంలో పోటీపడుతున్నారు. కనీస పరిశీలన కూడా చేయకుండా చేస్తున్న పోస్టుల వల్ల ఇతరుల వ్యక్తిగత పరువు, ప్రతిష్టతకు భంగం కలిగించేలా వ్యవహరిస్తూ వివాదాలకు కారణమవుతున్నారు. మరో అడుగు ముందుకేసి అంశం ఏదైనా సరే నిరభ్యంతరంగా గ్రూపుల్లో చర్చించుకోవడానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. ఈక్రమంలో వ్యక్తుల వ్యక్తిగత అంశాలు సామాజిక మాధ్యమాల గ్రూపుల్లో చర్చనీయాంశంగా మారి రచ్చ రచ్చ అవుతున్నాయి. అవి అనేక రకాలుగా రూపాంతరాలు చెందుతున్నాయి. వివాదాస్పద, విద్వేషాలను రెచ్చగొట్టే విధంగా ఉన్న అంశాలు, అసభ్య పోస్టులను గ్రూపుల్లో షేర్‌చేయడం తప్పని తెలిసినా అనేకమంది మానడంలేదు. ఇతరుల కన్నా తామే ముందుగా షేర్ చేయాలన్న ఉబలాటంలో అవివేకంగా వ్యవహరిస్తూ తప్పుడు వార్తల వ్యాప్తికి కారణమవుతున్నారు. ఇటీవల బెల్లంపల్లిలో ఆరిజిన్ డెయిరీ వ్యవహారంలో సామాజిక మాధ్యమాల గ్రూపుల్లో అనేక పోస్టులు నిత్యకృత్యంగా విరాజిల్లిన విషయం తెలిసిందే.

ఇలా వ్యవహరిస్తే తప్పే

వాట్సాఫ్, ఫేస్‌బుక్, తదితర గ్రూపుల్లో అడ్మిన్‌లు, సభ్యులు నియమ నిబంధనలకు కట్టుబడి బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంటుంది. అవగాహన లేని, పూర్తిగా తెలియని సమాచారాన్ని గ్రూపుల్లో పోస్టు చేయరాదు. తప్పుదారి పట్టించే విధంగా ఉన్న సమాచారం గ్రూపులో పోస్టు చేసినా నేరమే అవుతుంది. వ్యక్తులను కించపరిచే విధంగా ఉన్నవి, అసభ్యకరంగా ఉన్నవి షేర్ చేయడం సరైందికాదు. మరీ ముఖ్యంగా వదంతులు వ్యాప్తించే విధంగా ఉన్న అంశాలను ఎట్టి పరిస్థితుల్లోనూ పోస్టు చేయవద్దు. నిర్లక్ష్యంగా వ్యవహరించి మరొకరిని క్షోభకు గురి చేయవద్దు. ఫొటోలను మార్ఫింగ్ చేసి ఇతరుల పరువుకు భంగం కలిగించడం చట్టరీత్యా నేరం అవుతుంది. అందుచేత అడ్మిన్లు గ్రూపు సభ్యులను ఎంపిక చేసుకోవడంలో నిశిత దృష్టి కలిగి ఉండాలి. తప్పుడు సమాచారం షేర్ చేస్తున్న సభ్యులను వెంటనే గ్రూప్ నుండి రిమూవ్ చేయడంతో పాటు ప్రతీ సభ్యుడు నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలి.

భంగం కలిగిస్తే చర్యలు



సామాజిక మాధ్యమాల గ్రూపుల్లో వ్యక్తుల పరువుకు భంగం కలిగించేలా పోస్టులు పెడితే ఊరుకునేది లేదు. బాధితుడు ఫిర్యాదు చేస్తే ఎంతటి వారైనా సరే చట్టపరంగా కేసులు నమోదు చేస్తాం. బాధ్యులైన గ్రూప్ అడ్మిన్‌లతో పాటు పోస్టు చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకుంటాం. ప్రతి ఒక్కరూ స్వీయ నియంత్రణ పాటించి శాంతిభద్రతలకు భంగం కలుగకుండా తోడ్పాటు అందించాలి.

– పంతాటి సదయ్య, ఏసీపీ, బెల్లంపల్లి

పీజీ పరీక్షల్లో ఇద్దరు డిబార్

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరుగుతున్న ఎస్‌డీఎల్‌సీఈ పీజీ పరీక్షల్లో బుధవారం ఇద్దరు విద్యార్థులు డిబార్ అయ్యారు. సదరు విద్యార్థులు మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడ్డారని కాకతీయ యూనివర్సిటీ ఎగ్జామినేషన్ కంట్రోలర్ మల్లారెడ్డి తెలిపారు.

వడదెబ్బతో వృద్ధుడు మృతి



రాజులు (ఫైల్)

కౌటాల(సిర్పూర్): కౌటాల మండలం ముత్తంపేట గ్రామానికి చెందిన దోని రాజులు (65) బుధవారం వడదెబ్బతో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం .. రాజులు ఉదయం వ్యవసాయ పనుల నిమిత్తం గ్రామ సమీపంలోని పంటచేనుకు వెళ్లాడు. మధ్యాహ్నం ఇంటికి వచ్చిన తర్వాత తీవ్ర అస్వస్థతకు గురై పలుమార్లు వాంతులు చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు సిర్పూర్(టి) సామాజిక ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు.

అబుదాబిలో చింతగూడ వాసి మృతి



శివకుమార్ (ఫైల్)

జన్నారం(ఖానాపూర్): జన్నారం మండలం చింతగూడ గ్రామానికి చెందిన నరెందుల శివకుమార్ (42) అబుదాబిలో గుండెపోటుతో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, దుబాయ్‌లోని స్నేహితులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన శివకుమార్ నాలుగేళ్ల క్రితం ఉపాధి నిమిత్తం దుబాయ్‌లోని అబుదాబికి వెళ్లాడు. బుధవారం తెల్లవారు జామున గుండెపోటు రావడంతో తోటి కార్మికులు ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతునికి భార్య శోభ, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతదేహం స్వగ్రామానికి చేరేలా ప్రభుత్వం చొరవ తీసుకోవా లని గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షుడు భూమన్న కోరారు.

గుడుంబా విక్రేతల బైండోవర్



తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

వేమనపల్లి(బెల్లంపల్లి): మండలంలోని కొత్తపల్లి, నీల్వాయి గ్రామాలకు చెందిన గుడుంబా విక్రేతలను బుధవారం తహసీల్దార్ రాజ్‌కుమార్ ఎదుట బైండోవర్ చేశారు. ఇటీవల 'సాక్షి'లో 'ఎక్సైజ్ వాళ్లకే డబ్బులు ఇచ్చినమ్.. మీరు ఏం చేస్తారు' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి ఎక్సైజ్ అధికారులు స్పందించారు. టాస్క్‌ఫోర్స్ సీఐలు మహేందర్‌సింగ్, గంగారెడ్డి కొత్తపల్లిలో సోదాలు నిర్వహించారు. గుడుంబా విక్రేతలు దుర్గం లచ్చయ్య, గంగారాం, నారాయణ, పద్మను బైండోవర్ చేశారు.

ఆర్‌కే1ఏను తనిఖీ చేసిన అధికారులు



తనిఖీలో పాల్గొన్న అధికారులు

రామకృష్ణాపూర్(చెన్నూర్): మాన్‌సూన్ ఆడిట్‌లో భాగంగా మందమర్రి ఏరియాలోని ఆర్‌కే1ఏ గని సర్ఫేస్ ప్రాంతాన్ని బుధవారం అధికారులు తనిఖీ చేశారు. గని పరిసర ప్రాంతాల్లో వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. రామగుండం సేఫ్టీ ఆఫీసర్ వెంకటరమణ, సర్వే ఆఫీసర్ జైనులాబుద్దీన్, జూనియర్ ఇంజినీర్ రాజేశం, గని మేనేజర్ శ్రీధర్‌రావు, ఎస్‌వో జయంత్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రూ.4 వేల జరిమానా

భీమిని: మహిళపై దాడి కేసులో మండలంలోని వీగాం గ్రామానికి చెందిన గాండ్ల అంకమ్మకు బుధవారం బెల్లంపల్లి సివిల్ కోర్టు జడ్జి హిమబిందు రూ.4 వేల జరిమానా విధించారు. 2016లో వీగాం గ్రామానికి చెందిన దుమ్మ రాజమ్మపై దాడి చేసిన ఘటనలో గాండ్ల అంకమ్మపై కేసు నమోదు కాగా విచారణలో నేరం రుజువు కావడంతో జరిమానా విధించినట్లు భీమిని ఎస్సై మహేందర్ తెలిపారు.

సైనిక్ పాఠశాలకు ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న సీఐ సంజీవ్

నస్పూర్(మంచిర్యాల): సైనిక్ పాఠశాలలో ఆరోతరగతిలో ప్రవేశానికి నిర్వహించిన పరీక్షలో నస్పూర్ పట్టణంలోని శ్రీరాంపూర్‌కు చెందిన బత్తుల జశ్వంత్ అత్యంత ప్రతిభ కనబర్చాడు. కరీంనగర్ జిల్లా రుక్మాపూర్‌లోని సైనిక్ పాఠశాలలో సీటు సాధించాడు. ఈ సందర్భంగా మంచిర్యాల రూరల్ సీఐ టి.సంజీవ్ బుధవారం విద్యార్థిని అభినందించారు. భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సృష్టి ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ అంబాల రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులోంచి పొగలు



పొగలు రావడంతో బస్సు దిగిన ప్రయాణికులు

కాగజ్‌నగర్‌టౌన్: ఆసిఫాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు (ఏపీ29జడ్ 1760)లో నుంచి పొగలు రావడంతో ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. బుధవారం రాత్రి కాగజ్‌నగర్ బస్టాండ్ నుంచి ఆసిఫాబాద్‌కు 40 మంది ప్రయాణికులతో బస్సు బయలుదేరింది. బస్టాండ్ సమీపంలోనే ఒక్కసారిగా ఇంజిన్ నుంచి పొగలు రావడంతో డ్రైవర్‌తో పాటు ప్రయాణికులు కిందకు దిగారు. ఇంజిన్‌లో సాంకేతిక లోపం కారణంగానే పొగలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. బస్సును బస్టాండ్‌లోనే నిలిపివేసి మరో బస్సులో ప్రయాణికులను ఆసిఫాబాద్‌కు తరలించారు.

జార్జిరెడ్డి ఉద్యమస్ఫూర్తితో ముందుకెళ్లాలి



నివాళులర్పిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

బెల్లంపల్లి: విద్యార్థి అరుణతార జార్జిరెడ్డి ఉద్యమ స్ఫూర్తితో విద్యార్థులు ముందుకెళ్లాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు రెడ్డిచరణ్ అన్నారు. బుధవారం బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో జార్జిరెడ్డి 51వ వర్ధంతి నిర్వహించారు. ముందస్తుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 14 వరకు జరిగే వర్ధంతి సభలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు మనోహర్, వినోద్, కళాశాల కమిటీ సభ్యులు నితిన్, రఘు, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

పవర్‌ప్లాంట్ కార్మికుల గోడు పట్టేదెవరికి?

- గతేడాది డిసెంబర్‌లో నిలిచిపోయిన ఉత్పత్తి
- ఉపాధి కోల్పోయిన కార్మికులు
- నాలుగు నెలలుగా వేతనాలు లేక ఇబ్బందులు



శాలివాహన పవర్‌ప్లాంట్‌లో నిరాహరదీక్ష చేస్తున్న కార్మికులు

పాతమంచిర్యాల: పాత మంచిర్యాల శివారులోని రంగపేటలో ఉన్న శాలివాహన గ్రీన్ ఎనర్జీ బయోమాస్ పవర్‌ప్లాంట్‌లో ఉత్పత్తి నిలిచిపోవడంతో పాటు నాలుగు నెలలుగా వేతనాలు రాకపోవడంతో తమ భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారిందని కార్మికులు ఆందోళన చెందుతున్నారు. పవర్‌ప్లాంట్‌లో సుమారు వందమంది కార్మికులు విధులు నిర్వర్తిస్తున్నారు. కంపనీ పవర్ పర్చేజ్ అగ్రిమెంట్ 2022 డిసెంబర్ 6వ తేదీతో ముగియడంతో యాజమాన్యం ఉత్పత్తి నిలిపివేసింది. దీంతో అప్పటి నుంచి కార్మికులకు ఉపాధి కరువైంది. వేతనాలు, బోనస్ ఇప్పించాలని ఎమ్మెల్యే దివాకర్‌రావు, అసిస్టెంట్ లేబర్ కమిషనర్, వరంగల్‌లో జాయింట్ లేబర్ కమిషనర్, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని కార్మికులు వాపోతున్నారు. పలుమార్లు కార్మిక సంఘాల నాయకులు ప్లాంట్ యాజమాన్యంతో మాట్లాడినా వారి నుంచి స్పందన లేకపోవడంతో గత్యంతరంలేక మూడు రోజులుగా కంపెనీ ఆవరణలో నిరాహారదీక్షకు పూనుకున్నారు. స్పందించిన పవర్‌ప్లాంట్ డైరెక్టర్ మల్కా నవీన్ ఈ నెల 12న కార్మికులకు రావాల్సిన జీతాలు, బోనస్ చెల్లింపుల విషయం మంచిర్యాలకు వచ్చి మాట్లాడతామని హామీ ఇచ్చాడు. ఆయన రాక పోగా కార్మికులపై రామగుండం సీపీకి ఫిర్యాదు చేశాడు. దీంతో బుధవారం మంచిర్యాల ఏసీపీ తిరుపతిరెడ్డి కార్మికులను పిలిపించుకుని ఈ నెల 15న రామగుండం సీపీ కార్యాలయంలో హాజరుకావాలని సూచించారు. దీంతో తాము శాంతియుతంగా పోరాటం చేస్తుంటే యాజమాన్యం తమను అణగదొక్కాలని చూస్తోందని కార్మికులు ఆరోపిస్తున్నారు. తమకు వేతనాలు, బోనస్ చెల్లించని పక్షంలో కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ మల్కా కొమురయ్యకు చెందిన హైదరాబాద్‌లోని ఢిల్లీ పబ్లిక్‌స్కూల్, ఢిల్లీ ఇంజినీరింగ్ కాలేజీ, పల్లవి మోడల్ స్కూల్ ఎదుట నిరసనలు చేపడుతామన్నారు. ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయడానికి సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.

వేతనాలు చెల్లించాలి



20 ఏళ్లుగా కంపెనీలో పనిచేస్తున్నాం. పవర్ ప్లాంటే మాకు జీవనాధారం. ప్లాంటులో ఉత్పత్తి నిలిచిపోవడంతో జీతాలు రావడంలేదు. దీంతో కార్మికుల కుటుంబాలు దుర్భరస్థితిలో ఉన్నాయి. మా పరిస్థితులను అర్థం చేసుకుని మాకు రావాల్సిన వేతనాలు చెల్లించాలి.

– కుంటాల శంకర్, కార్మిక సంఘం అధ్యక్షుడు

ఉత్పత్తి కొనసాగించాలి



మాప్రాంతంలో పవర్‌ప్లాంట్ ఏర్పాటైతే మాకు ఉపాధి దొరుకుతుందని కంపెనీ నిర్మాణం కోసం రెండెకరాల భూమి ఇచ్చాం. కంపెనీలో 20 ఏళ్లుగా పనిచేస్తున్నా. వచ్చే జీతం పైనే ఆధారపడి బతుకుతున్నాం. జీతాలు లేక పూటగడవని పరిస్థితి ఎదురైంది. ఉత్పత్తి కొనసాగేలా చర్యలు తీసుకోవాలి.

– సత్యనారాయణ, కార్మికసంఘం జనరల్ సెక్రటరీ

ముంపు బాధితులకు పరిహారం ఇవ్వాలి



ఆందోళన చేస్తున్న బీజేపీ నాయకులు

మంచిర్యాలఅగ్రికల్చర్: ఎల్లంపల్లి ప్రాజెక్ట్ ముంపు గ్రామాల ప్రజలకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఎదుట గ్రామస్తులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ మాట్లాడుతూ ఎల్లంపల్లి ప్రాజెక్టు కింద లక్సెట్టిపేట, హాజీపూర్ మండలాల్లో భూములు కోల్పోయిన బాధిత కుటుంబాలకు 14 ఏళ్లు దాటినా రాష్ట్ర ప్రభుత్వం పరిహారం ఇవ్వడంలేదన్నారు. అప్పటి కాంగ్రెస్, ఇప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వాలు నష్టపరిహారం చెల్లించకుండా కార్యాలయాల చుట్టూ తిప్పించుకుంటున్నాయన్నారు. అప్పటి ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్‌రావు, ఇప్పటి ఎమ్మెల్యే దివాకర్‌రావు ప్రాజెక్టు నిర్మాణ సమయంలో కమీషన్లు దండుకుని పేద ప్రజలకు అన్యాయం చేశారని ఆరోపించారు. ముంపు బాధితులకు రావాల్సిన పెండింగ్ పరిహారం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. అనంతరం కలెక్టరేట్ ఏవోకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు బొప్పు కిషన్, దామెరకుంట నర్సయ్య, శ్రీరామ్, భూమేష్, ముదాం మల్లేశ్, రెడ్డిమల్ల అశోక్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉపకరణాలు

మంచిర్యాలటౌన్: దివ్యాంగులకు 2022–23 ఆర్థిక సంవత్సరానికి గాను మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ, తెలంగాణ దివ్యాంగుల సహకార సంస్థ ఉపకరణాలు అందించనుంది. దివ్యాంగులు, బధిరులు, అంధులు, మానసిక దివ్యాంగులకు సహాయ ఉపకరణాలు ఉచితంగా పంపిణీ చేయనుంది. ఉపకరణాల కోసం https://tsobmms.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 11నుంచి 25వరకు దరఖాస్తులకు అవకాశం కల్పించారు. దరఖాస్తులను జిల్లా ఎంపిక కమిటీ పరిశీలించి అర్హుల జాబితాను రాష్ట్ర కార్యాలయానికి పంపిస్తారు. ఎంపికైన అర్హులకు ఉచితంగా ఉపకరణాలు అందిస్తారు. గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షల ఆదాయం పరిమితి ఉండాలి. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న వారు సంబంధిత ధ్రువపత్రాలను జిల్లా సంక్షేమ అధికారి మహిళా శిశు దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ మంచిర్యాల జిల్లా కార్యాలయంలో అందించాలని అధికారులు పేర్కొన్నారు. గతంలో దరఖాస్తు చేసుకున్న వారు మరోసారి దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని జిల్లా సంక్షేమ శాఖ అధికారి చిన్నయ్య తెలిపారు.

జిల్లాకు 135 ఉపకరణాలు

అర్హత కలిగిన దివ్యాంగులకు అందించేందుకు గాను జిల్లాకు 135 పరికరాలు మంజూరయ్యాయి. ఇందులో రెట్రోఫిటెడ్ మోటరైజ్డ్ వెహికిల్స్ 10, బ్యాటరీ వీల్‌చైర్లు 8, ల్యాప్‌టాప్‌లు 5, మూడు చక్రాల రిక్షాలు 19, సాధారణ వీల్‌చైర్‌లు 3, చంక కర్రలు 37, చేతికర్రలు 15, డైసీ ప్లేయర్లు 1, బధిరులకు శ్రవణ యంత్రాలు(హియరింగ్ ఎడ్స్) 13, స్మార్ట్ కేన్స్ 3, టీఎల్ఎం కిట్స్ 8, 4జి స్మార్ట్ ఫోన్లు 13 ఇవ్వనున్నారు.

అంతర్జాతీయస్థాయిలో ప్రతిభ అభినందనీయం



క్రీడాకారులను అభినందిస్తున్న కలెక్టర్

నస్పూర్(మంచిర్యాల): జిల్లాకు చెందిన క్రీడాకారులు పలు విభాగాల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబర్చడం అభినందనీయమని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. ఇజ్రాయిల్‌లో జరిగిన బీడబ్ల్యూఎఫ్ అంతర్జాతీయ బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొన్న స్థితప్రజ్ఞారెడ్డి, గోవాలో జరిగిన మాస్టర్-70 ప్లస్ జాతీయస్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొని కాంస్య పతకం సాధించిన పళ్లెం రాజలింగులను నస్పూర్‌లోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పళ్లెం రాజలింగు త్వరలో కొరియాలో జరుగనున్న అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం అభినందనీయమన్నారు. వీరిని స్ఫూర్తిగా తీసుకుని జిల్లాలోని మిగతా క్రీడాకారులు క్రీడారంగంలో మరింత నైపుణ్యం ప్రదర్శించాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రెయినీ కలెక్టర్ పి.గౌతమి, జిల్లా క్రీడా, యువజనశాఖ అధికారి శ్రీకాంత్‌రెడ్డి, అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, ఉపాధ్యక్షుడు వాసు, కోశాధికారి సత్యపాల్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి మధు, అధికారులు పాల్గొన్నారు.

జెడ్పీ కార్యకలాపాలపై ఆరా



జెడ్పీ సీఈవో నరేందర్‌ను అడిగి వివరాలు తెలుసుకుంటున్న ట్రెయినీ కలెక్టర్ గౌతమి

మంచిర్యాలటౌన్: జిల్లాకు వచ్చిన ట్రెయినీ కలెక్టర్ పి.గౌతమి వివిధ ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లి వాటికి సంబంధించిన అంశాలను తెలుసుకుంటున్నారు. అందులో భాగంగా బుధవారం జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయానికి వెళ్లి ఎలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తారు? జెడ్పీ నిధులను గ్రామాలకు ఏ రకంగా కేటాయిస్తారు? వివిధ అభివృద్ధి పనులను జెడ్పీ సమావేశాల్లో నిర్ణయించి చేపట్టే అంశాలను జెడ్పీ సీఈవో కే.నరేందర్‌ను అడిగి తెలుసుకున్నారు.